ఓలా స్కూటర్లపై భారీ రాయితీ

ఎస్1-ఈ స్కూటర్‌పై రూ.26,750 డిస్కౌంట్

న్యూఢిల్లీ, మార్చి 13: ఎలక్ట్రిక్ స్కూటర్ల తయారీ సంస్థ ఓలా..హోలీ పండుగను దృష్టిలో పెట్టుకొని ప్రత్యేక ఆఫర్లను అందుబాటులోకి తీసుకొచ్చింది. హోలీ ఫ్లాష్ సేల్‌తో ప్రారంభించిన ఈ ఆఫర్ల కింద ఎస్1 ఈ-స్కూటర్లపై రూ.26,750 తగ్గింపునిస్తున్నది. అలాగే ఎస్1 ఎక్స్+(జనరేషన్ 2)పై రూ.22 వేలు డిస్కౌంట్‌ను ఇస్తున్నది. దీంతో ఈ రెండు మాడళ్ల ప్రారంభ ధరలు రూ.89,999, రూ.82,999కి దిగివచ్చాయి. ఈ ప్రత్యేక ఆఫర్లు ఈ నెల 17 వరకు మాత్రమే అందుబాటులో ఉండనున్నాయని పేర్కొంది. దీంతోపాటు మిగతా ఎస్1 స్కూటర్లపై కూడా రూ.25 వేల డిస్కౌంట్ ఇస్తున్నది. ప్రస్తుతం సంస్థ మూడు రకాల స్కూటర్లను విక్రయిస్తుండగా, ఇవి రూ.69,999 నుంచి రూ.1,79,999 ధరల శ్రేణిలో లభిస్తున్నాయి. వీటితోపాటు కొత్తగా ఓలా స్కూటర్లను కొనుగోలు చేసిన వారికి రూ10,500 వరకు ఆర్థిక ప్రయోజనాలు కల్పిస్తున్నది. దీంట్లో రూ.2,999 విలువైన మూవ్ ఆపరేటింగ్ సిస్టమ్, రూ.14,999 విలువైన వారెంటీని రూ.7, 499కి అందిస్తున్నది. వీటిలో ఎస్1 ప్రో+ మాడల్ రూ.1,59,999 నుంచి రూ.1.85 లక్షల మధ్యలో లభించనుండగా, ఎస్1 ప్రో మాడల్ రూ.1,29,999 నుంచి రూ.1,54, 999, ఎస్1 ఎక్స్ మాడల్ రూ.89,999 నుంచి రూ.1,19,999 మధ్యలో ధర నిర్ణయించింది.

రాబోయేది కోతల కాలమే!

ఇంకా తగ్గనున్న వడ్డీరేట్లు



వచ్చే ద్రవ్యసమీక్షల్లో రెపోరేటు 75 బేసిస్ పాయింట్లు దిగిరావచ్చన్న అంచనాలు

ఈ ఆర్థిక సంవత్సరం ద్రవ్యోల్బణం రిజర్వ్ బ్యాంక్ ఆమోదయోగ్య స్థాయిలోనే

తాజా నివేదికలో ఎస్బీఐ రిసెర్చ్ వెల్లడి

న్యూఢిల్లీ, మార్చి 13: రాబోయే ద్రవ్యసమీక్షల్లో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) కీలక వడ్డీరేట్లను గట్టిగానే కోత పెట్టవచ్చుని ఎస్బీఐ రిసెర్చ్ ఎకోరాప్ తమ తాజా నివేదికలో అంచనా వేసింది. ఈ ఏడాది ఏప్రిల్, జూన్, అక్టోబర్ నెలల్లో జరిగే ద్వైమాసిక ద్రవ్య పరపతి విధాన సమీక్షల్లో రెపోరేటును 25 బేసిస్ పాయింట్ల చొప్పున మొత్తం 75 బేసిస్ పాయింట్లు తగ్గించే వీలుందని చెప్పున్నది. గత నెల జరిగిన ద్రవ్యసమీక్షలో దాదాపు ఐదేండ్ల తర్వాత రెపోరేటును ఆర్బీఐ పావు శాతం తగ్గించిన విషయం తెలిసిందే. అంతకుముందు 2020 మే నెలలో చివరిసారిగా తగ్గించారు. ఇప్పుడు రెపోరేటు 6.25 శాతంగా ఉన్నది. కరోనాతో దిగాలుపడిన దేశ ఆర్థిక వ్యవస్థను ఉత్తేజపర్చేందుకు వడ్డీరేట్లను పెద్ద ఎత్తున తగ్గిస్తూపోయిన ఆర్బీఐ.. ఆ తర్వాత ద్రవ్యోల్బణం అదుపు పేరిట వరుసగా పెంచుతూపోయింది. దీంతో 6.50 శాతానికి చేరింది. అయితే వచ్చే ద్రవ్యసమీక్షల్లో వడ్డీరేట్లు తగ్గుతాయన్న సంకేతాలను అప్పటి ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ ఇచ్చారు. అందుకు తగ్గట్టే దాస్ తర్వాత వచ్చిన కొత్త గవర్నర్ సంజయ్ మల్హోత్రా.. ఫిబ్రవరిలో చేపట్టిన తన మొదటి ద్రవ్యసమీక్షలోనే 25 బేసిస్ పాయింట్లు తగ్గించారు. ఈ క్రమంలో వచ్చే ఏప్రిల్, జూన్ ద్రవ్యసమీక్షల్లోనూ వడ్డీరేట్లు 25 బేసిస్ పాయింట్ల చొప్పున తగ్గవచ్చని, ఆగస్టులో విరామం ఇచ్చి అక్టోబర్ సమీక్షలో మళ్లీ 25 బేసిస్ పాయింట్లు తగ్గించవచ్చని ఎస్బీఐ రిసెర్చ్ అంచనా వేస్తున్నది. ఇలా ఈ ఏడాది కనీసం 75 బేసిస్ పాయింట్లైనా రెపోరేటు తగ్గుతుందన్న విశ్వాసాన్ని వెలిబుచ్చుతున్నది.

4.7 శాతానికి ద్రవ్యోల్బణం

ద్రవ్యోల్బణం అదుపులోకి వస్తుండటం వడ్డీరేట్ల కోతలకు కలిసొస్తున్నదని ఎస్బీఐ రిసెర్చ్ చెప్తున్నది. ఈ జనవరి-మార్చిలో వినియోగదారుల ధరల సూచీ (సీపీఐ) ఆధారిత ద్రవ్యోల్బణం 3.9 శాతానికి తగ్గవచ్చని, మొత్తం ఈ ఆర్థిక సంవత్సరం (2024-25) 4.7 శాతానికి పరిమితం కావచ్చని పేర్కొంటున్నది. వచ్చే ఆర్థిక సంవత్సరం (2025-26) సైతం 4-4.4 శాతం శ్రేణిలోనే ఉండవచ్చుంటున్నది. దీంతో ఆర్బీఐ ఆమోదయోగ్య స్థాయిలోనే ద్రవ్యోల్బణం గణాంకాలుండటం వల్ల వడ్డీరేట్ల కోతలను ఇంకా ఆశించవచ్చని అంటున్నది. ఈ ఫిబ్రవరిలో రిటైల్ ద్రవ్యోల్బణం ఏడు నెలల కనిష్ఠాన్ని తాకుతూ 3.6 శాతంగా నమోదైన సంగతి విదితమే. ఆహారోత్పత్తులు, శీతల పానీయాలు, కూరగాయల ధరలు తగ్గడమే ఇందుకు కారణమని కేంద్ర ప్రభుత్వం చెప్తున్నది.

బ్యాంకులపైనే ఆధారం

ఆర్బీఐ రెపోరేటును తగ్గించినా.. దానికి అనుగుణంగా బ్యాంకులు తామిచ్చే రుణాలపై వడ్డీరేట్లను తగ్గించకపోతే రుణగ్రహీతలపై భారం అలాగే ఉంటుందని, మార్కెట్‌లో కొనుగోలు శక్తి పెరగదని నిపుణులు చెప్తున్నారు. ఆర్బీఐ కూడా ఇటీవలికాలంలో ఇదే ఆందోళనను వ్యక్తం చేస్తూ వడ్డీరేట్ల తగ్గింపు ప్రయోజనాన్ని కస్టమర్లకు ఇవ్వాలని తరచూ సూచిస్తున్నదీ చూస్తూనే ఉన్నాం. రుణాలపై వడ్డీరేట్లు తగ్గితే ఈఎంఐల భారం దిగుతుంది. ఇది రియల్టీ, ఆటో, కన్జ్యూమర్ గూడ్స్ తదితర రంగాల్లో సేల్స్‌ను పెంచుతుంది. మొత్తానికి వచ్చే ఆర్బీఐ ద్రవ్యసమీక్షలపై అటు రుణగ్రహీతలు, ఇటు వ్యాపార-పారిశ్రామిక వర్గాలకు, మరోవైపు బ్యాంకులకు పెద్ద ఎత్తునే అంచనాలున్నాయని చెప్పవచ్చు.

కోతలకు ట్రంప్ సెగ

దేశీంగా ద్రవ్యోల్బణం అదుపులోకి వచ్చినా ఆర్బీఐకి వడ్డీరేట్ల తగ్గింపునకు మరో అడ్డంకి ట్రంప్ రూపంలో వచ్చిపడుతున్నది. అంతర్జాతీయ వాణిజ్యంలో సుంకాల పోరుకు కాలు దువ్వుతున్న అగ్రరాజ్యాధినేత.. భారత్‌పైనా వచ్చే నెల నుంచి అధిక సుంకాలు పడుతాయని హెచ్చరిస్తున్నది తెలిసిందే. ఇదే జరిగితే అమెరికా నుంచి దిగుమతయ్యే వస్తూత్పత్తుల రేట్లు అమాంతం పెరగడం ఖాయమే.

బీమా ప్రీమియంలపై జీఎస్టీ తగ్గింపు!

న్యూఢిల్లీ, మార్చి 13: బీమా ప్రీమియం చెల్లింపుదారులకు త్వరలో ఊరట లభించే అవకాశాలు కనిపిస్తున్నాయి. బీమా ప్రీమియం వసూళ్లపై విధిస్తున్న జీఎస్టీని తగ్గించే విషయంపై కేంద్ర ప్రభుత్వం తీవ్రస్థాయిలో కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తున్నది. ఈ విషయంపై బీమా నియంత్రణ మండలి ఐఆర్‌డీఏఐ సూచనలు చేయాలని జీఎస్టీ కౌన్సిల్ ఆదేశించినట్లు తెలుస్తున్నది. ఈ నిర్ణయానికి అనుగుణంగా వచ్చే జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలోనే రేట్ల తగ్గింపుపై నిర్ణయం తీసుకునే అవకాశాలున్నాయి. మే, జూన్ నెలలో జీఎస్టీ కౌన్సిల్ సమావేశంకాబోతున్నది. ప్రస్తుతం హెల్త్, లైఫ్ ఇన్సూరెన్స్ ప్రీమియం వసూళ్లపై 18 శాతం జీఎస్టీని వసూలు చేస్తున్న విషయం తెలిసిందే. దీనిని తగ్గించాలనే ప్రతిపాదనపై గత కొన్నేండ్లుగా చర్చలు జరుగుతున్నప్పటికీ ఇంకా కొలిక్కిరాలేదు. ఈ సారి కొలిక్కిరానున్నట్లు, ఎంతమేర తగ్గించేదానిపై చర్చలు జరుగుతున్నాయని ప్రభుత్వవర్గాలు సూచనప్రాయంగా వెల్లడించాయి. ప్రీమియం వసూళ్లపై జీఎస్టీని సున్నా లేదా 5 శాతం లేదా 12 శాతానికి తగ్గించే అవకాశాలున్నాయి. కానీ, ఇటీవల కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను బీమా రంగ ప్రతినిధులు కలుసుకొని 12 శాతం విధించాలని సూచించారంట. పలువురు రాష్ట్ర మంత్రులు కూడా 5 శాతం విధించాలని ప్రతిపాదించారు. ఈ నేపథ్యంలో రంగంలోకి దిగిన ఐఆర్‌డీఏఐ..బీమా రంగ ప్రతినిధులతో సంప్రదింపులు జరుపుతున్నది. త్వరలో జీఎస్టీ కౌన్సిల్‌కు ఒక నివేదికను సమర్పించనున్నది.

నిధుల సేకరణలో కెనరా బ్యాంక్

న్యూఢిల్లీ, మార్చి 13: కెనరా బ్యాంక్ మరోసారి నిధులను సేకరించడానికి సిద్ధమవుతున్నది. బాసెల్-3 నిబంధనలకు లోబడి టైర్-2 బాండ్లను జారీ చేయడం ద్వారా రూ.4 వేల కోట్ల నిధులను సమీకరించాలని యోచిస్తున్నది. ఐదు లేదా పదేండ్ల కాలపరిమితితో ఈ బాండ్లను జారీ చేస్తున్నది. ఈ నిధుల సేకరణకు బ్యాంక్ బోర్డు అనుమతి నిచ్చినట్లు పేర్కొంది.

ఫోర్బ్స్40 అండర్ 40లో హైదరాబాదీ

హైదరాబాద్, మార్చి 13: హైదరాబాద్‌కు చెందిన వ్యాపారవేత్త అకిన్ అనలిటిక్స్ సీఈవో, ఫౌండర్ జానకి పులపర్తి..ఫోర్బ్స్ 40 అండర్ 40 జాబితాలో చోటు దక్కించుకున్నారు. కృత్రిమ మేధస్సుతో నడిచే డ్రోన్లను తయారు చేసే సంస్థకు ఆమె నాయకత్వం వహిస్తున్నారు. రక్షణ, వ్యవసాయం, ఇండస్ట్రియల్స్ రంగాల్లో పరిశోధనలు గావించారు. అలాగే 15 వేల మంది స్వయం సహాయక బృందాలకు చెందిన మహిళలకు డ్రోన్ల పైలెట్లుగా తీర్చిదిద్దారు.

సెన్సెక్స్ @1,05,000?

ఈ ఏడాది డిసెంబర్‌కల్లా చేరవచ్చు

మోర్గాన్ స్టాన్లీ అంచనా

ముంబై, మార్చి 13: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాలతో ఉరుముతున్నారు. అంతర్జాతీయ మార్కెట్లు ఒకడుగు ముందుకు, నాలుగడుగులు వెనుకకు అన్నట్టున్నాయి. భౌగోళిక-రాజకీయ ఉద్రిక్తతలు ఆందోళనల్ని రేకెత్తిస్తుంటే.. మదుపరులు స్టాక్స్ నుంచి పెట్టుబడుల ఉపసంహరణలకు దిగుతూ ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తున్నారు. భారతీయ పరిస్థితులూ ఇందుకు మినహాయింపు కాదు. అయినప్పటికీ బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ ఈ ఏడాది ఆఖరుకల్లా లక్ష మార్కును దాటి 1,05,000 వద్దకు వెళ్తుందన్న ఓ తాజా అంచనా ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారుతున్నది. అవును.. మోర్గాన్ స్టాన్లీ వేసిన ఈ అంచనా ట్రేడ్ వర్గాల్లో హల్‌చల్ చేస్తున్నదిప్పుడు. ప్రస్తుతం సెన్సెక్స్ ఉన్న స్థాయితో చూసినట్టైతే.. మోర్గాన్ స్టాన్లీ అంచనా 41 శాతం అధికం మరి. గురువారం 74వేల మార్కునూ కోల్పోయింది. ఈ క్రమంలో ఏకంగా లక్ష స్థాయిని దాటేస్తుందని మోర్గాన్ స్టాన్లీ చెప్పడం మిక్కిలి ప్రాధాన్యతను సంతరించుకుంటున్నది. ట్రంప్ టారిఫ్ భయాలతో ఇటీవలికాలంలో దేశీయ స్టాక్ మార్కెట్లు వరుస నష్టాలనే చవిచూస్తున్నాయి. అప్పుడప్పుడు పెరిగినా.. ఆ తర్వాత వచ్చే నష్టాలు ఆ ఆనందాన్ని దూరం చేస్తున్నాయి. అయితే పరిస్థితులన్నీ చక్కబడుతాయన్నట్టుగా మోర్గాన్ స్టాన్లీ చెప్తున్నది. దీంతో మదుపరుల్లో కొత్త ఆశలు చిగురించే వీలుందని స్టాక్ బ్రోకర్లు ఆశాభావాన్ని వ్యక్తం చేస్తున్నారు.

74వేల దిగువకు సెన్సెక్స్

రియల్టీ, ఐటీ, వాహన రంగ షేర్లలో గురువారం భారీగా విక్రయాలు జరగడంతో వరుసగా ఐదోరోజూ సూచీలు నష్టపోయాయి. 200 పాయింట్లకుపైగా నష్టపోయిన సెన్సెక్స్ 74 వేల దిగువకు పడిపోయింది. చివరకు 73,828.91 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం 73.30 పాయింట్లు కోల్పోయి 22, 397.20 వద్ద ముగిసింది. స్టాక్ మార్కెట్ల వరుస నష్టాలతో మదుపరులు లక్షల కోట్ల సంపదను కోల్పోతున్నారు.

ఎల్ జీ ఐపీవోకి సెబీ గ్రీన్‌సిగ్నల్

న్యూఢిల్లీ, మార్చి 13: దక్షిణ కొరియాకు చెందిన ప్రముఖ ఎలక్ట్రానిక్స్ పరికరాల తయారీ సంస్థ ఎల్‌జీ ఐపీవోకి స్టాక్ మార్కెట్ నియంత్రణ మండలి సెబీ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. వాటాల విక్రయం ద్వారా రూ.15 వేల కోట్ల నిధులను సేకరించాలని సంస్థ భావిస్తున్నది. స్టాక్ మార్కెట్లో లిస్ట్ కాబోయే దక్షిణ కొరియాకు చెందిన రెండో సంస్థ ఎల్‌జీ కానుండటం విశేషం. ఇప్పటికే గతేడాది హ్యుందాయ్ మోటర్ స్టాక్ మార్కెట్లో లిస్టైన విషయం తెలిసిందే. 15 శాతానికి సమానమైన 10.18 కోట్ల షేర్లను విక్రయించే ప్రతిపాదనపై గతేడాది సెబీకి ఎల్‌జీ దరఖాస్తు చేసుకున్నది. ప్రస్తుతం సెబీ నుంచి అనుమతిపొందినట్లు కంపెనీ వర్గాలు వెల్లడించాయి. మొత్తం ఐపీవో వివరాలు వెల్లడించకపోయినప్పటికీ రూ.15 వేల కోట్ల స్థాయిలో ఉంటుందని విశ్లేషకులు అంచనావేస్తున్నారు. గతేడాదికిగాను రూ. 64,087 కోట్ల ఆదాయాన్ని ఆర్జించింది.

ఇన్సూరెన్స్‌లోకి పతంజలి

డీఎస్ గ్రూప్‌తో కలిసి మాగ్మా జనరల్ ఇన్సూరెన్స్ కొనుగోలుకు రెడీ

న్యూఢిల్లీ, మార్చి 13: యోగా గురువు రామ్‌దేవ్ బాబా నేతృత్వంలోని పతంజలి ఆయుర్వేద్, రజ్నీగంధా తయారీదారు ధరం పాల్ సత్యపాల్ గ్రూప్ (డీఎస్ గ్రూప్) కలిసి సనోటి ప్రాపర్టీస్ ఎల్ఎల్‌పీ అనుబంధ సంస్థ మాగ్మా జనరల్ ఇన్సూరెన్స్‌ను కొనుగోలు చేయనున్నాయి. ఈ బీమా సంస్థను ఆదార్ పూనవాలా, రైజింగ్ సన్ హోల్డింగ్స్ సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి. కాగా, కంపెనీ విలువ రూ.4,500 కోట్లుగా నిర్ణయించి ఈ డీల్ జరుగుతున్నట్టు గురువారం వెలువడిన ఓ ప్రకటన చెప్తున్నది. షేర్ల కొనుగోలు ఒప్పందం ప్రకారం మాగ్మా జనరల్ ఇన్సూరెన్స్‌తోపాటు సెలికా డెవలపర్స్, జాగ్వార్ అడ్వైజరీ సర్వీసెస్‌ల అమ్మకానికి సనోటి ప్రాపర్టీస్ ఆమోదం తెలిపింది. రెగ్యులేటరీ అప్రూవల్స్‌కు లోబడి ఈ లావాదేవీ పూర్తి కానున్నది. వివిధ విభాగాల్లో మాగ్మా జనరల్ ఇన్సూరెన్స్ 70కిపైగా ప్రొడక్ట్స్‌ను అందిస్తున్నది. అన్ని ప్రధాన రిస్క్‌లకు బీమా కల్పిస్తున్నది.

జాతరలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కమిషనర్ సునీత

భక్తులకు ఇబ్బందులు కలుగొద్దు

- **జాతరలో మౌలిక వసతులు కల్పించాలి**
- **దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ సునీత**
- **నమస్తే తెలంగాణకు స్పందన**

గీసుగొండ, మార్చి 13: కొమ్మాల లక్ష్మీనర్సింహస్వామి జాతరలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగొద్దని దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ సునీత సూచించారు. 'జాతరలో కానరాని సౌకర్యాలు' శీర్షికన గురువారం నమస్తే తెలంగాణలో కథనం ప్రచురితమైంది. స్పందించిన సునీత జాతరలో పర్యటించారు. ఈ సందర్భంగా అధికారులు, సిబ్బందికి సూచనలు చేశారు. జాతర ప్రాంగణంలో లైట్లకు వెంటనే మరమ్మతులు చేపట్టాలన్నారు. పారిశుధ్య పనులు ఎప్పటికప్పుడు చేపట్టాలని కార్యదర్శులు, సిబ్బందిని ఆదేశించారు. వరంగల్-నర్సంపేట ప్రధాన రహదారిలోని ఆర్చి నుంచి ఆలయం వరకు రోడ్డుపై దుమ్ము లేవకుండా రోజుకు మూడుసార్లు ట్యాంకర్ల ద్వారా నీళ్లు పట్టాలన్నారు. ఆమె వెంట తహసీల్దార్ రియాజుద్దీన్, పరిశీలకుడు అనిల్, ఈవో నాగేశ్వర్‌రావు, సీఐ మహేందర్ ఉన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

రాయపర్తి, మార్చి 13: ప్రజలు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని వర్ధన్నపేట ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ స్వరూప సూచించారు. కొండూరులోని జడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థులకు జెండర్ ఈక్వాలిటీ, గర్ల్స్ చైల్డ్ ఎంపవర్‌మెంట్ క్లబ్ ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాల వినియోగం-భవిష్యత్‌లో ఎదురయ్యే ప్రమాదాలపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. స్వరూప ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్ఎం కొణతం పద్మలత, శ్రీదేవి, అనితారాణి, అమరస్వర్ణ, రమాదేవి, ఎం.సత్యం, ఆర్.రాంరెడ్డి, వీవీ ఆచార్య, కె.సత్యనారాయణ, కటకం రఘు, కె.వెంకటరమణ, ఎల్.నాగరాజు, బి.శ్యామ్‌సుందర్, జీ భోజ్యానాయక్, ఎన్.స్వామి, బి.శివకృష్ణ పాల్గొన్నారు.

వెంచర్ నిర్వాహకులకు నోటీసులు

వర్ధన్నపేట, మార్చి 13: అనుమతి లేకుండా వెంచర్లు ఏర్పాటు చేస్తున్న వారికి గ్రామ పంచాయతీ అధికారులు నోటీసులు జారీ చేస్తున్నారు. మండలంలోని ఇల్లంద శివారులో జాతీయ రహదారి పక్కన ఉన్న పంట పొలాల్లో కొంతమంది రైతుల నుంచి భూములు కొనుగోలు చేసి వెంచర్లు చేస్తున్నారు. నాలుగు రోజులుగా వెంచర్ చుట్టూ ప్రహరీ నిర్మిస్తున్న విషయం తెలియడంతో గ్రామ పంచాయతీ కార్యదర్శి రామారావు గురువారం వెంచర్ నిర్వాహకులకు నోటీసులు జారీ చేశారు. అక్రమంగా వెంచర్లు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

కంటి అద్దాల పంపిణీ ప్రారంభం

వరంగల్‌చౌరస్తా, మార్చి 13: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉచిత కంటి అద్దాల పంపిణీ కార్యక్రమాన్ని కలెక్టర్ సత్యశారద గురువారం ప్రారంభించారు. కలెక్టరేట్‌లో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జవహర్ నవోదయ విద్యార్థులకు కంటి అద్దాలను కలెక్టర్ అందజేశారు. జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 36,368 మంది విద్యార్థుల్లో 33,516 (92.36 శాతం) మందికి వర్ధన్నపేట, నర్సంపేట ప్రభుత్వ జనరల్ హాస్పిటల్, వరంగల్ ప్రాంతీయ నేత్ర వైద్యశాలల్లో ఉచిత కంటి పరీక్షలు నిర్వహించినట్లు చెప్పారు. కంటి సమస్యలతో బాధపడుతున్న 1024 మందిని గుర్తించి పునఃపరీక్షలు చేసిన అనంతరం వివరాలను ఉన్నతాధికారులకు అందించామన్నారు. దీని ఆధారంగా జిల్లాలో 333 మందికి కంటి అద్దాలు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ ప్రకాశ్, ఆర్‌బీఎస్‌కే అధికారి నాగేశ్వర్‌రావు, ఆప్తాలమిక్ వైద్యాధికారులు ప్రసాద్, రాజేందర్ పాల్గొన్నారు.

రోడ్డుపై మక్కలు.. వాహనదారులకు తిప్పలు

- **365 హైవేపై తరచూ ప్రమాదాలు**
- **జంకుతున్న ప్రయాణికులు**

నర్సంపేట, మార్చి 13: ప్రధాన రహదారిపై మక్కల కుప్పలతో వాహనదారులు తిప్పలు పడుతున్నారు. ఈ రహదారిపై ఆదమరిచి ప్రయాణిస్తే అంతే సంగతులను ప్రయాణికులు వాపోతున్నారు. మండలంలోని నర్సంపేట-మల్లంపల్లి ఎన్‌హెచ్ 365 జాతీయ రహదారిలోని ఆకులతండా, ఇటుకాలపల్లి, ముత్తోజిపేట, రాజుపేట గ్రామాల్లో రైతులు రోడ్డుకు ఇరువైపులా మక్కలు ఆరబోస్తున్నారు. దీంతో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. మండలంలోని రైతులకు కల్లాల కొరతతో మక్కలను రహదారిపై ఆరబెడుతున్నారు. రాత్రి సమయంలో ఆరబోసిన మక్కలపై కవర్లు కప్పుతున్నారు. దీంతో రోడ్డు సరిగ్గా కనిపించక వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇటుకాలపల్లి జడ్పీహెచ్ఎస్ ముందు, మలుపుల వద్ద కూడా మక్కలను రైతులు ఆరబోశారు. దీంతో ఎప్పుడు ఏరూపంలో ప్రమాదం ముంచుకొస్తుందోనని స్థానికులు, విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఇదే రహదారిపై ఆరబోసిన మక్కలను తప్పించే క్రమంలో అదుపుతప్పి పలు వాహనాలు బోల్తా పడగా, పలువురు గాయాలపాలయ్యారు. సంబంధిత అధికారులు చొరవ చూపి తగిన చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

ఆకులతండాలో ప్రధాన రహదారిపై రైతులు ఆరబోసిన మక్కలు

37 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం స్వాధీనం

నర్సంపేట/కరీమాబాద్, మార్చి 13: మండలంలోని ముగ్దుంపురం గ్రామానికి చెందిన కొమ్ము శివ, నర్సంపేట పట్టణం పాకాల రోడ్డుకు చెందిన ఇక్కటి కిరణ్ లబ్ధిదారుల నుంచి సేకరించిన పీడీఎస్ బియ్యాన్ని టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ ఆదేశాల మేరకు సీఐ బాబులాల్ ఆధ్వర్యంలో గురువారం వారి ఇళ్లల్లో సోదాలు చేసి రూ. 60 వేల విలువైన 24 క్వింటాళ్ల బియ్యాన్ని పట్టుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. అలాగే, వరంగల్ శివనగర్‌లోని ఓ ఇంట్లో అక్రమంగా నిల్వ చేసిన రూ. 33,800 విలువైన 13 క్వింటాళ్ల బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు

విరగబూసిన మోదుగు పూలు

విరబూసిన మోదుగు పూలు

నర్సంపేట, మార్చి 13: మండలంలోని పలు గ్రామాల్లో మోదుగు పువ్వులు విరగబూశాయి. హోలీ పర్వదినానికి ముందు మోదుగు పూలు విరగబూస్తాయి. కాలక్రమేన మోదుగు చెట్లు అంతరించిపోయాయి. గ్రామాల్లో అక్కడక్కడా ఉన్న మోదుగు చెట్లకు పూలు విపరీతంగా పూశాయి. హోలీ సందర్భంగా మోదుగు చెట్టు పూలు తెంచి వేడి నీళ్లల్లో ఉడికించి, ఆ తర్వాత వచ్చిన రసాన్ని తీసి హోలీ రోజున ఒకరిపై ఒకరు చల్లుకోవడం ఆనవాయితీ. గతంలో మోదుగు పూల రసాన్ని ఎక్కువగా హోలీ రోజు ఉపయోగించేవారు. రానురాను రసాయనాలు వాడుతున్నారు. ఏదేమైనా మోదుగు పూల రంగుతో హోలీ జరుపుకుంటే ఆ ఆనందమే వేరని ప్రజలు అంటున్నారు.

రేపటి నుంచి 'డిజిటల్' బోధన

గిర్మాజీపేట, మార్చి 13: జిల్లాలో పైలట్ ప్రాజెక్టుగా ఎంపికైన 11 ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లోని విద్యార్థుల్లో కనీస అభ్యసన సామర్థ్యాలు పెంచడమే లక్ష్యంగా శనివారం నుంచి 'ఆర్టిఫిషియల్ ఇంటలీజెన్స్(ఏఐ)తో డిజిటల్ క్లాసులు నిర్వహించనున్నట్లు డీఈవో మామిడి జ్ఞానేశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. చెన్నారావుపేట మండలంలోని లింగాపురం, జల్లి, పాపయ్యపేట, గీసుగొండ మండలంలోని మచ్చాపూర్, పర్వతగిరి మండలంలోని గోపనపల్లి, నర్సంపేట మండలంలోని మహేశ్వరం, రాయపర్తి మండలంలోని ఊకల్, తిరుమలాయపల్లి, కాట్రపల్లి ప్రాథమిక పాఠశాలల్లోని ఎస్జీటీ ఉపాధ్యాయులకు టెక్నికల్‌గా శిక్షణ ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఆయా మండలాల్లోని ఎంఈవోలు, కాంప్లెక్స్ హెచ్ఎంలు డిజిటల్ క్లాసులను సక్రమంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని డీఈవో సూచించారు.

సాగు, తాగునీటిపై సమీక్ష

పర్వతగిరి, మార్చి 13: తాగు, సాగునీరు, నర్సరీలపై మండల ప్రత్యేకాధికారి శ్రీమతి నీరజ గురువారం మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లతో సమీక్షించారు. వేసవి దృష్ట్యా గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. నర్సరీల్లో జూన్ వరకు మొక్కలు అందుబాటులో ఉండాలని, ఖాళీ బాగుల్లో నారు లేదా విత్తనాలు వేయాలని, అన్ని నర్సరీల్లో మునగ, కరివేపాకు మొక్కలు పెంచాలని ఆదేశించారు. ఎంపీడీవో మాలోత్ శంకర్‌నాయక్, ఎంపీవో పాక శ్రీనివాస్, మిషన్ భగీరథ ఏఈ, ఇరిగేషన్ ఏఈ పాల్గొన్నారు.

సర్కారు దవాఖానలో తాగునీటి ఇక్కట్లు

- **గుక్కెడు నీటి కోసం ఇబ్బంది పడుతున్న రోగులు**
- **కొనుగోలు చేయలేక అవస్థలు**

వర్ధన్నపేట, మార్చి 13: నిత్యం రోగులు, గర్భిణులు, బాలింతలతో రద్దీగా ఉండే వర్ధన్నపేటలోని ప్రభుత్వ దవాఖానలో తాగునీటి కొరత ఏర్పడింది. తాగేందుకు గుక్కెడు నీళ్లు లేక ఇబ్బందులు పడుతున్నారు. వేసవి ప్రారంభం కావడంతో ఆసుపత్రిలో తాగునీరు లేక పేదలు పక్కనే ఉన్న హోటళ్లకు వెళ్లి నీటిని కొనుగోలు చేసుకొని తాగుతున్నారు. ఈ విషయాన్ని పలుమార్లు ఆసుపత్రిలో పని చేసే సెక్యూరిటీ సిబ్బంది, డాక్టర్లకు చెప్పినా ఫలితం లేదని రోగులు, అటెండెంట్లు వాపోతున్నారు. ప్రతి వంద మంది రోగులకు ఒక ఫ్రిజ్ ఏర్పాటు చేశారు. కానీ, ఫ్రిజ్‌లో నీళ్లు పోయడంలో అధికారులు శ్రద్ధ చూపకపోవడంతో నిరుపయోగంగా మారింది. దవాఖానకు వచ్చే పేదలు బయట నీళ్లు కొనలేక అవస్థలు పడుతున్నారు. ఇక సాయంత్రం తాగునీటి కోసం కిలో మీటరు వెళ్లి తెచ్చుకోవాల్సి వస్తున్నదని అటెండెంట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి ప్రభుత్వ దవాఖానలో తాగునీటి వసతి కల్పించాలని ప్రజలు, రోగులు, అటెండెంట్లు కోరుతున్నారు.

ఏరియా దవాఖానలో వృథాగా ఉన్న ఫ్రిజ్

తహసీల్దార్‌కు పరిస్థితులు వివరిస్తున్న నాయకులు, కార్మికులు

కార్మిక భవనం కూల్చివేతపై విచారణ

పోచమ్మమైదాన్, మార్చి 13: అజంజాహి మిల్లు కార్మిక భవనం కూల్చివేతపై జాతీయ ఎస్సీ కమిషనర్ ఆదేశాల మేరకు వరంగల్ తహసీల్దార్ కార్యాలయంలో గురువారం విచారణ ప్రారంభించారు. పలువురు నాయకులు, కార్మికులు కలిసి ఆనాటి కార్మిక భవనానికి సంబంధించిన ఆధారాలను వరంగల్ తహసీల్దార్ ఎండీ ఇక్బాల్‌కు అందజేశారు. ఏజే మిల్లు కార్మిక భవనం స్థలం ఆక్రమణపై గతంలో వర్కర్స్ యూనియన్ నాయకులు, దళిత కార్మికులు జాతీయ ఏస్సీ కమిషన్‌కు దరఖాస్తు చేశారు. ఈ నేపథ్యంలో చేపట్టిన విచారణలో భాగంగా వరంగల్ తహసీల్దార్ కార్యాలయంలో ఏజే మిల్లు కార్మిక భవనం పరిరక్షణ సమితి నాయకులు, దళిత కార్మికులు తహసీల్దార్ ఇక్బాల్ అడిగిన సమాచారంతోపాటు కార్మిక భవనానికి సంబంధించిన అన్ని ఆధారాలు సమర్పించారు. ఈ సందర్భంగా అర్బన్ కో ఆపరేటివ్ బ్యాంకు చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, ఎస్సీ మోర్చా అధ్యక్షుడు మార్టిన్ లూథర్ మాట్లాడుతూ 75 ఏళ్లపాటు కార్మికుల సమావేశాలు, సభలకు వేదికైన భవనాన్ని కబ్జా చేసి కూల్చారని తెలిపారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా కన్వీనర్ గంగుల దయాకర్, జేఏసీ కన్వీనర్ డాక్టర్ కొణతం కృష్ణ, చెరువుల పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు పెరుమాళ్ల లక్ష్మణ్, ఆకెన వెంకటేశ్వర్లు, సముద్రాల పరమేశ్వర్, బాకం హరిశంకర్, సింగిరెడ్డి యశోద, భాస్కుల హరినారాయణ, గుత్తికొండ రవి, పల్లకొండ సుధాకర్, కొంపెల్లి ప్రవీణ్, ఆరోగ్యం పాల్గొన్నారు.



టెలీ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడే

ఆస్తి పన్నుపై వడ్డీ రాయితీ ఉండదు

వరంగల్, మార్చి 13: ఆస్తి పన్నుపై వడ్డీ రాయితీ ఉండదని, బకాయిదారులు సకాలంలో చెల్లించాలని సీడీఎంఏ టీకే శ్రీదేవి అన్నారు. మున్సిపల్ కమిషనర్లతో గురువారం ఆమె హైదరాబాద్ నుంచి టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. మున్సిపాలిటీల వారీగా పన్ను వసూళ్ల పురోగతిపై దిశానిర్దేశం చేశారు. వరంగల్ నుంచి కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడే పన్ను వసూళ్ల పురోగతిని వివరించారు. దీనిపై సీడీఎంఏ స్పందిస్తూ ఈ నెల 31లోగా వందశాతం వసూలు జరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. టెలీ కాన్ఫరెన్స్‌లో డిప్యూటీ కమిషనర్లు ప్రసన్నరాణి, రవీందర్‌యాదవ్ పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు సక్రమంగా చేపట్టాలి

నగరంలో పారిశుధ్య పనులు సక్రమంగా చేపట్టాలని కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడే సిబ్బందిని ఆదేశించారు. హనుమకొండ బస్‌స్టేషన్, వరంగల్ మెయిన్ రోడ్డులో ఆమె పారిశుధ్య పనులను తనిఖీ చేశారు. పారిశుధ్య కార్మికులు రోడ్లను శుభ్రం చేయడంతోపాటు డ్రైనేజీల శుభ్రం, గ్యాంగ్ వర్క్‌లు చేయాలన్నారు. స్థానికుల నుంచి సంతకాలు తీసుకొని లాగ్‌బుక్‌లో మొబైల్ నంబర్ నమోదు చేయాలని ఆదేశించారు. ఆమె వెంట సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ అనిల్, జవాన్లు ఉన్నారు.

నగర ప్రజలకు మేయర్ సుధారాణి హోలీ శుభాకాంక్షలు

వరంగల్, మార్చి 13: వరంగల్ నగర ప్రజలకు నగర మేయర్ గుండు సుధారాణి హోలీ శుభాకాంక్షలు తెలిపారు. ప్రేమ, ఆప్యాయత, సంతోషాలకు ప్రతీకగా నిలిచే హోలీ వేడుకను నగర ప్రజలు సంతోషంగా జరుపుకోవాలని ఆమె ఆకాంక్షించారు. ప్రజలు సహజ సిద్ధ రంగులు వాడాలని కోరారు.